

ఎన్నికల ఖర్చుపై నజర్

అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించేందుకు డబ్బులు, మద్యం పంపిణీపై దృష్టి పెట్టారు. ఈసీ కూడా ఈ ఖర్చుపై నజర్ వేసింది.

- 10లో ▸



కాంగ్రెస్‌దే అధికారం..

కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యమని మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌చవాన్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో మాట్లాడారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.0 /20.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం నుంచి చల్లటిగాలులు వీస్తాయి. సాయంత్రం నుంచి చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

సాహిత్యమే మనిషిని మహోన్నతుడిని చేస్తుంది



నిజామాబాద్ సిటీ : బహుముఖాలుగా విభిన్న ప్రక్రియలతో సాగుతున్న సాహిత్య సృజనయే మనిషికి మహోన్నతునిగా తీర్చిదిద్దుతుందని ప్రముఖ కథా రచయిత, సినిమా మాటల, కథా రచయిత పెద్దింటి అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ కల్యాణ మండపంలో మందారం సాహిత్య సమాఖ్య, దివంగత దారం శ్రీధర్‌రావు స్మారక ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి మందారం కథలపోటీ 2023 బహుమతుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన అశోక్ కుమార్ మాట్లాడుతూ దివంగత దారం శ్రీధర్‌రావు సంస్మరణలో జాతీయ స్థాయి కథల పోటీలు ఏర్పాటు చేసి బహుమతుల ప్రధాన సభను దారం గంగాధర్ నిర్వహించి దానిని సాహిత్య సభగా మల్చడం గొప్ప విషయమన్నారు. రచయిత్రి డాక్టర్ అమృత లత దారం కథాసాహిత్య సేవలను కొనియాడారు. ప్రముఖ కవి చందన్ రావు అధ్యక్షత వహించిన ఈ సభలో దారం గంగాధర్ రాసిన కథల సంపుటి 'తిత్లీ'ని, తొగర్ల సురేశ్ రచించిన' కోనేరు' పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. కథల పోటీ విజేతలను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథులుగా డాక్టర్ త్రివేణి, డాక్టర్ కాసర్ల నరేశ్ రావు, పెందోట వేంకటేశ్వర్లు, డాక్టర్ సాయిబాబు, బైస దేవిదాస్ పాల్గొన్నారు.

నేడు నీలకంఠేశ్వరాలయంలో లక్ష దీపోత్సవం


నిజామాబాద్ సిటీ : నగరంలోని శ్రీ నీలకంఠేశ్వరాయలంలో కార్తీక మాసం సందర్భంగా భారత్ జాగృతి శాఖ ఆధ్వర్యంలో నేడు లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు జాగృతి రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ భరద్వాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నీలకంఠేశ్వరాలయం కోనేరు వద్ద నిర్వహించే కార్యక్రమానికి భారత్ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని ఆయన తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



నిజామాబాద్ రూరల్ : రూరల్ సెగ్మెంట్‌లో ఈనెల 30న జరిగే ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరగాలని రూరల్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ గౌతమ్‌సింగ్ వెల్లడించారు. ఆదివారం మండలంలోని గుండారం గ్రామంలోని సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. గ్రామంలోని 10, 11, 12తో పాటు 13 బూత్‌లు సమస్యాత్మకంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా బూత్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాట్లు, ఎన్నికలు జరిగే సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్, సిబ్బందికి సూచించారు. తహశీల్దార్ అనిరుధ్, నయాబ్ తహసీల్దార్ రంజిత్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

యోగా క్రీడాకారులకు సన్మానం



ఖలీల్‌వాడి : ఈనెల 17,18న జరిగిన 10వ రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలలో గెలుపొందిన చరుభ, శ్రీనిధిలను జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు ఐశ్వర్య, కార్యదర్శి గంగాధర్ ఆదివారం సన్మానించారు. ఈనెల 23 నుంచి 27 వరకు అస్సాంలోని గౌహతిలోని టీఆర్‌పీ ఇండోర్ స్టేడియంలో జరుగనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా న్యాయవాదులు రాజ్ కుమార్ సబేదారు, ప్రవీణ్ కుమార్, కోశాధికారి కమలవాని, యోగా అసోసియేషన్ సభ్యులు రజిత, గాయత్రి, నర్మద తదితరులున్నారు.

'నీ భవితకు నీ ఓటే కీలకం' పుస్తకం ఆవిష్కరణ

కామారెడ్డి అర్బన్: తెలంగాణ రచయితల వేదిక(తెరవే) జిల్లా సమన్వయకర్త యెనిశెట్టి గంగాప్రసాద్ రాసిన 'నీ భవితకు నీ ఓటే కీలకం' గేయాల పుస్తకాన్ని ఆదివారం కలెక్టర్ క్యాంపు ఆఫీస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ ఓటర్లు జాగృతం కావాలన్నారు.

మేనిఫెస్టోలు
దశ మార్చేనా..?

అందరికంటే ముందుగానే మేనిఫెస్టో విడుదల చేసి ప్రచారంలో బీఆర్ఎస్ దూసుకుపోతుండగా.. తాజాగా మేనిఫెస్టోలు ప్రకటించిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తామిచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నాయి. ఇందుకోసం సోషల్‌మీడియాను వేదికగా మార్చుకుంటున్నాయి.



- హామీలను విస్తృతంగా ప్రచారం చేస్తున్న జాతీయపార్టీలు
- నిజాం షుగర్స్‌ను ప్రారంభిస్తామంటున్న కాంగ్రెస్, బీజేపీలు
- ఏపీ మాదిరిగా వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్న కాంగ్రెస్
- ఉమ్మడి పౌరస్మృతి ముసాయిదా కమిటీపై బీజేపీ ఆశలు
- గ్యాస్ సిలిండర్ రూ. 400కే ఇస్తామంటున్న బీఆర్ఎస్

జంగ్ తెలంగాణ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అసెంబ్లీ ఎన్నికల పో లింగ్‌కు కేవలం పదిరోజుల సమయమే మిగిలుంది. అయితే ముందుగానే మేనిఫెస్టో విడుదల చేసి ప్రచారంలో ముందున్న బీఆర్ఎస్ తాము చేసిన అ భివృద్ధి, సంక్షేమం చూసి గెలిపించాలని చెబుతుండడంతో పాటు రూ.400కే గ్యాస్ సిలెండర్ ఇస్తామని ప్రకటించింది. ఇదిలా ఉండగా జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు మాత్రం తాజాగా విడుదల చేసిన మేనిఫెస్టోలలోని అంశాలను విస్తృతంగా ప్రజల్లో కి తీసుకెళ్లేందుకు ప్రచారం చేస్తున్నాయి. ముఖ్యంగా ఇందుకోసం సోషల్ మీడియాను పెద్దఎత్తున వాడుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో ఎకానమీకి ఊతమిచ్చే విషయంలో కీలకమైన నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని కాంగ్రెస్, బీజేపీలు తమ మేనిఫెస్టోలో ప్రకటించాయి. భూమి రికార్డుల వ్యవ స్థ, ఉద్యోగాల భర్తీ విషయమై రెండు జాతీయ పా ర్టీలు ప్రత్యేకంగా మేనిఫెస్టోలో పొందుపరచడం గమనార్హం. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ చేస్తా మని రెండు పార్టీలు పేర్కొనడం గమనార్హం. రెండు పార్టీల మేనిఫెస్టోల నేపథ్యంలో వీటిపై ప్రచా రం మరింత హోరెత్తనుంది.

బీజేపీ 'మీభూమి'

బీజేపీ మేనిఫెస్టోలో సైతం ధరణి పోర్టల్ స్థానంలో 'మీభూమి' అనే వ్యవస్థ ఏర్పాటును పేర్కొంది. అలాగే ధరణిపై విశ్రాంత న్యాయమూర్తితో విచారణ కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్నెళ్లకొకసారి గ్రూప్–1 సహా అన్ని ఉద్యోగాల భర్తీ, విద్యార్థినులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు, ధాన్యం ధర రూ.3,100 ఇస్తామన్నారు. అదేవిధంగా ఎస్సీ వర్గీకరణతో పాటు కేంద్ర పథకాల అమలుకు సంబంధించి నోడల్ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని పేర్కొంది. ప్రత్యేక మైనింగ్ పాలసీ ద్వారా అక్రమ తవ్వకాలను ప్రోత్సహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఇక కీలకమైన ఇందూరు జిల్లాలో ప్రభావం చూపే అంశాలు కూడా బీజేపీ మేనిఫెస్టోలో పొందుపర్చడం గమనార్హం. గోవధ నిషేధం ఉల్లంఘిస్తే ఒక ఏడాది జైలు శిక్ష, వయోవృద్ధులకు అయోధ్య, కాశీ యాత్రలు ఉచితం, ఉమ్మడి పౌరస్మృతి అమలుపై ముసాయిదా కమిటీ, నిజాంపై పోరాడిన అమరుల స్మారక స్తూపాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. నిజాంపై పోరులో ఇందూరు ప్రాంతం నుంచి సు మారు 700 మంది వీరుల పాత్ర ఉంది. వీరిలో చాలామంది అ మరులయ్యారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 27ను రజాకార్ల దుష్కృత్యాల సంస్మరణ దినోత్సవంగా ప్రకటిస్తామని పేర్కొనడం విశేషం.

కాంగ్రెస్ 'భూమాత'

గతంలోనే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ తాజా మేనిఫెస్టోలో 'భూమాత' పేరిట భూరికార్డుల వ్యవస్థ ఏర్పాటు చేస్తామని పేర్కొంది. వ్యవసాయ జిల్లా కావడంతో దీని ప్రభావం పడనుంది. ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా ప్రభుత్వ పథకాల అమలు కోసం వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు రూ.25వేల పింఛన్, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, కౌలు రైతులకు పెట్టుబడి సాయం, రైతు కూలీలకు రూ.12వేలు ఇస్తామని, గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఉద్యోగాల భర్తీ కోసం కేలండర్ సైతం విడుదల చేయడం విశేషం. కాంగ్రెస్ హామీలను నమ్మవద్దని, కర్ణాటకలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదని బీఆర్ఎస్ ప్రచారం చేస్తుండడం గమనార్హం..

మధ్యాహ్న కార్మికులకు
ప్రాధాన్యత



మోర్తాడ్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ కార్మికులు

- తాము అధికారంలోకి వస్తే గౌరవ వేతనమిస్తామని ప్రకటించిన కాంగ్రెస్
- తొలిసారి మేనిఫెస్టోలో కార్మికుల అంశం ప్రస్తావన

మోర్తాడ్(బాల్కొండ) : ఎన్నో అవస్థలకు ఓర్చుతూ విద్యార్థులకు భోజనం వండి పెడుతున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీల కార్మికుల అంశం తొలిసారిగా ఎన్నికల వేళ చర్చకు వచ్చింది. మధ్యాహ్న భోజనం ఏజెన్సీ కార్మికుల విషయంలో ఇదివరకు ఏ ప్రభుత్వం సరైన విధంగా స్పందించలేదనే ఆరోపణలున్నాయి. 2022–23, 2023–24కు గాను ఏజెన్సీల కార్మికులు అనేకమార్లు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఏజెన్సీల కార్మికుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ తన మెనిఫెస్టోలో కార్మికులకు గౌరవ వేతనం విషయంను జోడించింది. తాము అధికారంలోకి వస్తే మధ్యాహ్న భోజన ఏజెన్సీల కార్మికులకు ప్రతి నెలా రూ.10వేల చొప్పున గౌరవ వేతనం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇవ్వడంతో కార్మికుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 1,156 ఉండగా ఏజెన్సీల కార్మికులు 2,500ల మంది వరకు ఉన్నారు. వీరికి ప్రతినెలా రూ. 3వేల గౌరవ వేతనం ప్రకటించినా ఆచరణలో అమలు కావడం లేదు. వేతనంతో పాటు బిల్లులు చెల్లించాల్సి ఉన్నా ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో కార్మికులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. అనేకమార్లు సమ్మె చేసినా రాష్ట్ర ప్రభుత్వం సరైన రీతిలో స్పందించలేదనే విమర్శలు ఉన్నాయి.

కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో గౌరవ వేతనం అంశంను చేర్చడంతో పాటు కార్మికులు కో రినంత పెంచడానికి అంగీకరించడం గమనార్హం. ఏజెన్సీ కార్మికుల్లో ఎక్కువ మంది మహిళలు, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు చెందినవారు ఉండటంతో వారి ఓట్లను రాబట్టుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఎత్తుగడ వేసిందనే అభిప్రాయం వ్యక్తమైతుంది. ఏదేమైనా తమ సమస్యను ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ పట్టించుకోలేదని కేవలం ఒకే ఒక పార్టీ ఎన్నికల సమయంలో తెరపైకి తీసుకురావడం విశేషమే అని ఏజెన్సీల కార్మికులు చెబుతున్నారు. కార్మికుల మద్దతు ఎలా ఉంటుందో చూడాలి.

ఉత్సవాలకు అంకురార్పణ

భీమ్‌గల్ : లింబాద్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం ఉదయం అంకురార్పణ, మృత్సంగ్రహణం, దీపారాధన, రక్షా బంధనం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అంకురార్పణ కార్యక్రమాన్ని ఆగమశాస్త్రం ప్రకారం పుట్టమట్టి సేకరించి 18 పాత్రల్లో పోసిధాన్యం విత్తులు వేశారు. కార్యక్రమంలో పురోహితులు పాల్గొన్నారు.





పెద్దతెరపై క్రికెట్ వీక్షణం

అహ్మదాబాద్‌లో జరిగిన ఇండియా ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్‌ను నగరంలోని పలు కాలనీల్లో పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేసి తిలకించారు. నగరంలోని బొబ్బిలి వీధిలో, కోట గల్లీలో పెద్ద తెరలు ఏర్పాటు చేసి మ్యాచ్‌ను వీక్షించారు. మ్యాచ్‌లో ఇండియా ఓడిపోవడంతో చివర్లో నిరుత్సాహానికి గురయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

మరోసారి బరిలో నిలిచిన 'చౌట్‌పల్లి'

- 2018లో మినహా మిగతా అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామానికి చోటు
- ఈ గ్రామం నుంచి ఎవరో ఒకరు పోటీల్లో నిలుస్తున్న వైనం
- రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేకస్థానం



మోర్తాడ్(బాల్కొండ) : రాష్ట్ర రాజకీయాల్లో గుర్తింపు పొందిన నాయకుల ఖిల్లాగా పేరొందిన చౌట్‌పల్లి మరోసారి అసెంబ్లీ బరిలో నిలిచింది. 2018లో నిర్వహించిన ముందస్తు ఎన్నికల్లో పోటీ చేయడానికి ఈ గ్రామానికి చెందిన ఏ నాయకునికి ఏ ఒక్క నియోజకవర్గం నుంచి అవకాశం లభించకపోవడంతో పోటీకి చౌట్‌పల్లి దూరమైంది. ఇప్పుడు జరుగుతున్న అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ బీజేపీ అభ్యర్థిగా బాల్కొండ నుంచి పోటీలో నిలువడం గమనార్హం. ఎన్నో ఏళ్ల నుంచి చౌట్‌పల్లికి చెందిన ఎవరో ఒకరు అసెంబ్లీలో బాల్కొండ లేదా ఆర్మూర్ నియోజకవర్గాల నుంచి ప్రాతినిథ్యం వహిస్తూనే ఉన్నారు. 2014 ఎన్నికల్లో ఈ గ్రామానికి చెందిన సురేష్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా ఆర్మూర్ నుంచి టీడీపీ అభ్యర్థిగా డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి బాల్కొండ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలుకావడంతో చౌట్‌పల్లికి అసెంబ్లీలో స్థానం లేకుండా పోయింది. 1952లో ఆర్మూర్ నియోజకవర్గం నుంచి చౌట్‌పల్లి హన్మంత్ రెడ్డి కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓటమి పాలైనారు. ఆ తరువాత ఆయన 1956లో జెడీకి మొట్టమొదటి చైర్మన్‌గా ఎంపికయ్యారు. 1978లో ఆర్మూర్ నియోజకవర్గం నుంచి జనతా పార్టీ తరపున కేఆర్ గోవింద్‌రెడ్డి పోటీ చేశారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన ఏలేటి మహిపాల్ రెడ్డి కూడా భీమ్‌గల్ సమితి అధ్యక్షుడిగా విధులు నిర్వహించారు. 1983లో ఏలేటి మహిపాల్‌రెడ్డి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైనారు. 1985లో మరోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసిన మహిపాల్‌రెడ్డి ఈ ఎన్నికల్లో గెలిచి అటవీశాఖ మంత్రిగా పని చేశారు. 1989లో మహిపాల్‌రెడ్డికి ఆర్మూర్ టిక్కెట్ దక్కలేదు. కాగా ఈ ఎన్నికల్లో బాల్కొండ కాంగ్రెస్ టిక్కెట్‌ను చౌట్‌పల్లికి చెందిన సురేష్‌రెడ్డికి పార్టీ అధిష్టానం కేటాయించగా ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. అలాగే 1994లో అన్నపూర్ణమ్మ ఆర్మూర్ ఎమ్మెల్యేగా, సురేష్‌రెడ్డి బాల్కొండ ఎమ్మెల్యేగా ఎంపికైనారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అసెంబ్లీలో రెండు నియోజకవర్గాలకు ప్రాతినిథ్యం వహించడం అప్పట్లో విశేషమే. 1999, 2004లో వరుసగా సురేష్‌రెడ్డి బాల్కొండ ఎమ్మెల్యేగా ఎంపికయ్యారు. 2004లో ఉమ్మడి రాష్ట్ర స్పీకర్‌గా వ్యవహరించారు. 2009 ఎన్నికల్లో ఆర్మూర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సురేష్‌రెడ్డి, టీడీపీ తరపున అన్నపూర్ణమ్మ నిలబడి సురేశ్‌రెడ్డిపై విజయం సాధించారు.

గులాబీ గుబాళింపు ఖాయం..

- కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే వృథానే..
- పనిచేసే ప్రభుత్వాన్ని నిలుపుకోవాలి
- రూరల్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



సాక్షి ఇంటర్వ్యూ

''రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లలో రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దాం. మునుపెన్నడూ లేని విధంగా రూ. వేల కోట్లతో అభివృద్ధి చేశాం. సీఎం కేసీఆర్ అధ్యర్యంలో బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను మూడోసారి విజయాన్ని అందిస్తాయి'' అంటూ రూరల్ బీఆర్ఎస్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే బాజిరెడ్డిని 'సాక్షి' ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది..

– డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్)

▸ రూరల్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి..?

☛ 58 ఏళ్ల సమైక్య పాలకుల హయాంలో రూరల్ నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురైంది. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత సహకారంతో తొమ్మిదిన్నరేళ్లలో రూ. వేల కోట్లతో రూరల్‌ను అభివృద్ధి చేశాం. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో రూ. 606 కోట్లతో అన్ని గ్రామాలు, గిరిజన తండాలకు బీటీ రోడ్లు వేశాం. 1,100 మంది దళితబంధు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున రూ.110 కోట్లు. గృహలక్ష్మి 3వేల మంది లబ్ధిదారులు.. ఒక్కొక్కరికి రూ.3లక్షల చొప్పున రూ.90 కోట్లు. రూ. 33.15 కోట్ల నిధులతో ధర్పల్లి మండల కేంద్రంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు. సిరికొండలోని చీమన్‌పల్లిలో రూ. 2.50 కోట్లతో పీహెచ్‌సీ నిర్మాణ పనులు. సిరికొండలో రూ. 5 కోట్లతో ఐటీఐ మంజూరు చేశాం.

డిచ్‌పల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు. డిచ్‌పల్లి నాగ్‌పూర్ గేట్ నుంచి బోర్గాం(పి) వరకు రూ.32 కోట్లతో రహదారి విస్తరణ, రోడ్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు. జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో రూ. 3.50 కోట్లతో సెంట్రల్ లైటింగ్, రోడ్ డివైడర్. ధర్పల్లి మండల కేంద్రంలో రూ. 6 కోట్లతో సెంట్రల్ లైటింగ్, రోడ్ డివైడర్. ఎస్‌డీఎఫ్, సీడీఎఫ్ నిధులు రూ.46కోట్లతో అభివృద్ధి పనులు. ధర్పల్లి చెరువులో బోటింగ్ ఏర్పాటు. రూ. 25కోట్లకు పైగా సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరు. 300 మంది మైనార్టీలకు రూ.3కోట్లు మైనార్టీబంధు. 200 మంది బీసీ లబ్ధిదారులకు రూ.2కోట్లు బీసీబంధు. రూ.670 కోట్లతో నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్లు, వంతెనలు నిర్మాణం. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధికి నిధులు రూ.37కోట్లు. రూ. 78.20 కోట్లతో రెండు పడకల గదుల ఇండ్ల నిర్మాణం. అలాగే పింఛన్ల రూపంలో రూ. 1500 కోట్లు పైగా నిధులు వెచ్చించాం. రూ.1,098 కోట్లతో కాళేశ్వరం ప్యాకేజ్ 21 (మంచిప్ప రిజర్వాయర్), ప్యాకేజ్ 21 ఏ (ఇన్‌ఫ్రాతో కలిపి (పైప్‌లైన్ పనులకు)) రూ. 2,623 కోట్లతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మంచిప్ప రిజర్వాయర్ పూర్తయితే లక్ష ఎకరాలకు నీళ్లు అందనున్నాయి. రూ.108 కోట్లతో మిషన్ కాకతీయ, రూ. 37 కోట్లతో కాలువల ఆధునీకరణ, రూ.23 కోట్లతో చిన్న ఎత్తిపోతల పథకాలు, రూ.51 కోట్లతో చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాం. రూ.162 కోట్ల సీజీఎఫ్ నిధులతో గుడులను అభివృద్ధి చేశాం. కమ్యూనిటీ హాళ్లు, కల్యాణ మండపాలు పూర్తి చేసాం.

▸ కొత్త మండలాలు, జీపీల పరిస్థితేంటి..?

☛ రూరల్‌లో ఇందల్వాయి, మోపాల్ కేంద్రాలతో కొత్త మండలాలను ఏర్పాటు చేశాం. ఇటీవలే రామడుగు (ప్రాజెక్ట్) మండలంగా నోటిఫికేషన్ జారీ అయింది. గుండారం మండల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. 50 గిరిజన తండాలను జీపీలుగా ఏర్పాటు చేసుకున్నాం. నూతన జీపీ భవనాల నిర్మాణానికి రూ. 10 కోట్లు మంజూరు చేశాం.

▸ నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు అమలు?

☛ రూరల్ నియోజకవర్గంలో పింఛన్ల రూరంలో 62,839 మందికి పింఛన్ల రూపంలో రూ.539.73 కోట్లు, 12,600 మందికి కల్యాణ లక్ష్మి, షాదీముబాకర్‌లో భాగంగా రూ. 127 కోట్లు మంజూరు చేశాం. గొల్ల కుర్మలకు రూ.40 కోట్లతో గొర్రెలు పంపిణీ. రూ. 25కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ ఇచ్చాం.

▸ యువత కోసం చేసిన పనులేంటి..?

☛ నియోజకవర్గంలో ఏడో బెటాలియన్ సహకారంతో 500 మంది నిరుద్యోగులకు రెన్నెల్ల పాటు గ్రూప్స్, ఎస్సై, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇప్పించాం. కోచింగ్ తీసుకున్న వారిలో 50శాతం మంది ఉద్యోగాలు సాధించారు.

▸ ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది..?

☛ నాకు ఎన్నికలు కొత్తేం కాదు.. పకడ్బందీ వ్యూహాలతో ముందుకెళ్తున్నాం. సీఎం కేసీఆర్ చాలా జాగ్రత్తలు చెప్పారు. వాటిని తూ.చ తప్పకుండా పాటిస్తున్నాం. ప్రజాప్రతినిధి, నాయకుడు అనే వాడు గెలిచినా, ఓడినా ప్రజల మధ్యే ఉండాలి. గ్రామాల్లోని ప్రజల వద్దకు ప్రచారానికి వెళ్తే బ్రహ్మరథం పడ్తున్నారు. గతంలో ప్రజలు కాంగ్రెస్ పాలన చూశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతతత్వాన్ని రెచ్చగొడుతోంది. దేవుడిని రాజకీయాల్లో వాడుతున్నారు. మేం కూడా హిందువులం, భక్తులమే. ఈ రెండు పార్టీలను ప్రజలు నమ్మడం లేదు. క్షేత్రస్థాయిలో ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కే ఉంది.

▸ రైతుల సంక్షేమానికి అమలవుతోన్న పథకాలు..?

☛ వ్యవసాయ రంగానికి 24 గంటల పాటు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. రైతులకు రుణమాఫీ రూ.180 కోట్లు, రైతు బంధు పథకంలో భాగంగా 2,66,485 మంది రైతులకు పెట్టుబడి సాయం రూ.583.75 కోట్లు చెల్లించాం. రైతు బీమా పథకంలో భాగంగా 1,060 మందికి ప్రీమియం చెల్లింపులకు రూ.53 కోట్లు నిధులిచ్చాం.

ప్రస్తుత హామీలేమిటి..?

☛ బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతిహామీని నెరవేరుస్తాం. బీఆర్ఎస్ పార్టీ మళ్లీ హ్యాట్రిక్ విజయం సాధించగానే ఆసరా పింఛన్లను విడతల వారిగా రూ.5వేలకు పెంచుతాం. వికలాంగులకు రూ. 6 వేలకు పెంచుతాం. ప్లాటు ఉన్న అర్హులందరికీ గృహలక్ష్మి పథకం కింద నిధులిస్తాం.

క్లుప్తంగా

ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు సీసీ కెమెరాలు



మద్నూర్(జుక్కల్): అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా.. ఫిర్యాదు అందిన 100 నిమిషాలలోపే ఆ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ తిరిగే వాహనాలకు 360 డిగ్రీల కోణంలో తిరిగే సీసీ కెమెరాలను అమర్చారు. ఈ కెమెరా పుటేజీని జిల్లా, డివిజనల్ రిటర్నింగ్ అధికారులు తమ కార్యాలయాల్లోనే ఉండి పర్యవేక్షించేలా అనుసంధానం చేశారు.

ఆకాశ దీపోత్సవం



కామారెడ్డి రూరల్: కామారెడ్డి పట్టణ శివారులోని ఇల్చిపూర్ గ్రామంలో కొలువుదీరిన సరస్వతి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ఆకాశ దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దత్తాద్రి శర్మ, విజయ్ పాండేల ఆధ్వర్యంలో ఆకాశ కార్తీక దీపంను, వేద మంత్రోచ్ఛరణాల మధ్య వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్, కోలాల సిద్దాగౌడ్, మహేష్, భక్తులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ వేగవంతం చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): ఓటరు స్లిప్పుల పంపిణీ వేగవంతం చేయాలని ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ సూచించారు. ఆదివారం ఆయన లింగంపేట మండలం బోనాల్ గ్రామంలో ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ ఆలస్యం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపటిలోగా ప్రతి గ్రామంలో ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఓటరుకు స్లిప్పులు అందేలా చూడాలన్నారు. తమకు స్లిప్పులు రాలేదని ఫిర్యాదు వస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ ఓటరు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలన్నారు. ఓటు వేయడం తమ బాధ్యతగా భావించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్, ఆర్‌ఐ బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చుపై ఈసీ నజర్..

- ప్రలోభాలకు పాల్పడితే పరేషాన్ తప్పదు
- అభ్యర్థులకు ఎన్నికల సిబ్బంది హెచ్చరిక

ఎల్లారెడ్డి: అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా పది రోజులే ఉండటంతో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఇప్పటి వరకు తమ ప్రచారానికి కీలక నేతలను ఆకర్షించుకునే పనిలో బిజీగా ఉన్న అభ్యర్థులు ఇక ఓటర్లను ప్రసన్నం చేసుకోడానికి పరుగులు పెడుతున్నారు. ఓటర్లను తమ వైపు మలుపుకొనేందుకు అభ్యర్థులు మనీ, మద్యం, బహుమతులపైనే ఆధారపడుతున్నారు. ఈ సారి ఓటర్లను ప్రభావితం చేసేందుకు అభ్యర్థులు ఇచ్చే నజరానాలపై నజర్ పెట్టాలని, ఎన్నికల్లో పెట్టే ఖర్చులపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని ఎన్నికల కమిషన్ సిబ్బందికి ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఓటర్లను ప్రభావితం చేసే వారితో పాటు విధి నిర్వహణలో అభ్యర్థులకు సహాయం చేసే ఎన్నికల అధికారులు, సిబ్బందిపై భారత శిక్షాస్మృతి, ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం జరిమానాలు విధించడమే కాకుండా కేసులు పెట్టి జైలుకు పంపించాలని ఈసీ ఆదేశించినట్లు అధికారులు తెలిపారు.

ప్రలోభాలకు పాల్పడే అభ్యర్థులపై కేసులు

- ఎన్నికల్లో ఓట్ల కోసం డబ్బులు పంపిణీ చేసేటప్పుడు అభ్యర్థులు, వారి అనుయాయులపై దొరికితే ఐపీసీ 171(ఇ) ప్రకారం కేసు నమోదు చేసి సంవత్సరం జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారు. ప్రజాప్రాతినిధ్యం చట్టం ప్రకారం కూడా కేసులు పెట్టే అవకాశం ఉంది.
- ఏ పార్టీ అభ్యర్థి అయినా ఓటర్లను ప్రభావితం చేయడానికి అబద్ధాలు మాట్లాడుతూ ప్రచారం చేస్తే నేరమే అవుతుంది. తమ ప్రత్యర్థులపై తీవ్రమైన పదజాలం, ఆరోపణలు చేస్తూ అబద్ధపు ప్రసంగాలు చేసే వారిపై ఐపీసీ 171(జి) ప్రకారం భారీ జరిమానాలు విధిస్తారు
- ఎన్నికల్లో తమకే ఓటేయాలని అభ్యర్థులు ఓటర్లను బెదిరించేందుకు ప్రయత్నిస్తే ఐపీసీ 171(సి) కింద జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారు. ఒక్కోసారి ఈ రెండు వేసే అవకాశం ఉంది.
- ఓటర్లను ఆకర్షించడానికి అభ్యర్థులు మహిళలకు చీరలు, మిక్సీలు, కుక్కర్లు లాంటి గృహోపకరణాలు, యువ ఓటర్లకు క్రికెట్ కిట్లు, సెల్ ఫోన్లు లాంటివి ఇవ్వడం ఎన్నికల్లో పరిపాటిగా మారింది. ఇలా ప్రలోభపెట్టిన అభ్యర్థులపై ఐపీసీ 171(ఈ) ప్రకారం ఏడాది జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.
- ఎన్నికల్లో దొంగ ఓట్లు వేయించిన అభ్యర్థులు, వేసిన అతని అనుయాయులపై కూడా కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. ఒకరి ఓటు బదులు వారికి తెలియకుండానే వేరెకరు వేస్తే దొంగ అవుతుంది. ఇలా దొంగ ఓట్లకు పాల్పడిన అభ్యర్థులపై ఐపీసీ 171(ఎఫ్) కింద ఏడాది జైలు, జరిమానా విధిస్తారు.
- ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు ఏదైనా మతాన్ని, వర్గాన్ని కించపరిచేలా, వర్గ విద్వేషాలు పెరిగేలా ప్రసంగాలు, కరపత్రాలు తయారుచేసిన వారిపై కేసులు పెడతారు. ఇలాంటి వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టం (ఆర్‌పీ యాక్ట్) 125 నిబంధన ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారు.
- నిబంధనలకు మించి మద్యం నిల్వలు కలిగి ఉన్నా, విక్రయించినా ఓటర్లకు పంపిణీ చేసినా ఎక్సైజ్, పోలీసు అధికారులు సంబంధిత అభ్యర్థులపై కేసులు నమోదు చేస్తారు. ఓటర్లకు కల్లు, సారాతో పాటు ఎలాంటి మద్యం పంపిణీ చేసినా ఆ అభ్యర్థులపై ఎక్సైజ్ చట్టం–1968 సెక్షన్ 34(ఎ) ప్రకారం ఆరు నెలల నుంచి ఏడాది జైలు శిక్ష, రూ. 5 వేల నుంచి రూ. 20 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పండి



సింగరాయపల్లిలో బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

మాచారెడ్డి/రామారెడ్డి: చావు నోట్లో తల పెట్టి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌పై పోటీ చేస్తున్న ప్రతిపక్ష అభ్యర్థులకు డిపాజిట్ దక్కకుండా చేసి బుద్ధి చెప్పాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. ఆదివారం పాల్వంచ మండలంలోని సింగరాయపల్లి, ఇసాయిపేట, మంతన్ దేవునిపల్లి, వాడి, ఫరీదుపేట, బండరామేశ్వరపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతాంగానికి మూడు గంటల కరెంట్ ఇస్తామంటున్న కాంగ్రెస్ పాలన కావాలో.. 24 గంటల పాటు ఉచిత విద్యుత్ అందిస్తున్న బీఆర్‌ఎస్ సంక్షేమ పాలన కావాలో ప్రజలే తేల్చుకోవాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, పెన్షన్లు ఇస్తున్న కేసీఆర్‌ను మూడో సారి సీఎంను చేస్తే మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశ పెడతారని చెప్పారు. గంప గోవర్ధన్‌కు ఆయా గ్రామాల్లో బోనాలతో ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు, జెడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బాల్ చంద్రం, రాజాగౌడ్, ఆనంద భైరయ్య, తోట భూమయ్య, రాజేందర్ గౌడ్, ఎల్లం, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంప గోవర్ధన్

హ్యాట్రిక్ వీరుడు హన్మంతుడు

- ఐదో సారి ఎన్నికల బరిలో..
- తనదైనశైలిలో ప్రచారం

నిజాంసాగర్: జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గం 1952 సంవత్సరంలో ఏర్పాటైంది. నాటి నుంచి నియోజకవర్గానికి 14 సార్లు ఎన్నికలు జరుగగా 7 గురు ఎమ్మెల్యేలు అసెంబ్లీ గేటు తాకారు. 1957, 1967, 1972 ఏళ్లలో నియోజకర్గ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో మూడు సార్లు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. ఆ తర్వాత 1978లో అసెంబ్లీ ఎస్సీ రిజర్వు అయ్యింది. నియోజకవర్గం ఏర్పాటైన నాటి నుంచి వరుసగా మూడు సార్లు హన్మంత్‌సింధే ఎమ్మెల్యేగా గెలుపొంది 2018లో హ్యాట్రిక్ సాధిచారు. కాంగ్రెస్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించినా హ్యాట్రిక్ సాధ్యం కాలేదు. 2004లో హన్మంత్‌సింధే రాజకీయాల్లోకి వచ్చారు. 2004లో నిర్వహించిన ఎన్నికల్లో టీడీపీ నుంచి బరిలో నిలిచారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి సౌదాగర్ గంగారాం చేతిలో 1,200 ఓట్లతో హన్మంత్‌సింధే ఓటమి పొందారు. 2009లో మరోమారు టీడీపీ నుంచి పోటీ చేసిన హన్మంత్‌సింధే 34 వేల ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి సావిత్రీబాయిపై విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్ర సాధనతో హన్మంత్ సింధే బీఆర్‌ఎస్‌లో చేరారు. 2014లో బీఆర్‌ఎస్ నుంచి బరిలో నిలిచిన హన్మంత్‌సింధే కాంగ్రెస్ అభ్యర్థి సౌదాగర్ గంగారాంపై వరుసగా రెండో సారి విజయం సాధించారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థి సౌదాగర్ గంగారాంపై హన్మంత్‌సింధే 36 వేల ఓట్ల మెజార్టీతో మూడవ సారి విజయం సాధించారు. వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా హన్మంత్‌సింధే విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. ఇప్పుడు ఐదోసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో గట్టి పోటీ నెలకొంది. ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో వేచి చూడాలి.



ప్రచారం చేస్తున్న హన్మంత్‌సింధే

ఎన్నికల్లో పోటీకి దూరంగా కమ్యూనిస్టులు

మోర్తాడ్: బుల్లెట్‌తో సాధ్యం కాని పనులను బ్యాలెట్‌తో సాధించుకోవచ్చని భావించిన వామ పక్షాలు ఈ సారి ఎన్నికల బరిలో అభ్యర్థులను నిలుపకుండా అందరిని విస్మయానికి గురి చేశాయి. గతంలో తమ ప్రభావంతో ప్రజలను గుప్పిట్లో పెట్టుకున్న సీపీఐ(ఎంఎల్), జనశక్తి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలు పలుమార్లు ఎమ్మెల్యే అభ్యర్థులుగా పార్టీ నాయకులను బరిలో నిలిపాయి. బీడీ కార్మికులు, హమాలీ కార్మికులు, రైతు కూలీలు, జీపీ కార్మికులు ఇలా ఎంతో మంది వివిధ రంగాల్లోని కార్మికులను ఏకపథంలో నిలిపిన కార్మిక సంఘాలకు నాయకత్వం వహించిన వామ పక్షాలు ఎన్నికల బరిలో నిలిచాయి.

బాల్కొండ నియోజకవర్గంలో సుమారు 30వేల మంది బీడీ కార్మికులు ఉంటారు. బీడీ కార్మికులతో ప్రత్యక్ష సంబంధాలున్న న్యూడెమోక్రసీ నాయకులు గతంలో వీరిని నమ్మి ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి వామపక్షాలు పోటీకి ఆసక్తిని చూపకపోవడం గమనార్హం.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌చవాన్, షబ్బీర్‌అలీ

- బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం ఒక్కటే
- మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌చవాన్ వెల్లడి

ఖలీల్‌వాడి: కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతులకు సాగునీరు అందిస్తామని చెప్పి కేసీఆర్ కుటుంబం రూ. లక్ష కోట్లు దోచుకుందని మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌చవాన్ ఆదివారం అన్నారు. నగరంలోని సంజీవయ్యనగర్ కాలనీలో కార్నర్ మీటింగ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. నగరంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం ఈ మూడు పార్టీలు గొడుగు కింద పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కాంగ్రెస్‌ను పార్టీని గెలిపించాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు.

తెలంగాణ అమరవీరుల త్యాగాలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిందని, అమరవీరుల కుటుంబాలను విస్మరించిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కేశవేణు, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, పీసీసీ కార్యదర్శి గడుగు గంగాధర్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- బీఆర్‌ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న పోచారం కూతురు, కోడలు



మైలారంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి బతుకమ్మలు, బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

నస్రుల్లాబాద్: నియోజవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి తనకు ఓటు వేయాలని బీఆర్‌ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఓటర్లను కోరారు. మండలంలోని మైలారం, రాములగుట్ట తండా, నస్రుల్లాబాద్, బొప్పాస్‌పల్లి, లింగంపల్లి, బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామాల్లో ఆదివారం ఎన్నికల నిర్వహించారు. ఈ సందర్భంగా మైలారంలో ప్రచారం నిర్వహించి బీఆర్‌ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నస్రుల్లాబాద్ మండలంలోని ప్రతి గ్రామంలో జరిగిన అభివృద్ధిని చూస్తే తన పని తనం ప్రజలకే తెలుస్తుందని అన్నారు. ఇప్పటి వరకు 11 వేల ఇళ్లను పేదలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని స్పీకర్ కోరారు. ప్రచారాల్లో పార్టీ మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, ఎంపీపీ పాల్త్య విఠల్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, కంది మల్లేశ్, గోపీ, కీర్యా, వెంకట రమణ, యశోద, మహేందర్, సుధీర్ బాబు, సాయిలు, రాము, మైశాగౌడ్, నర్సింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోచారం కుటుంబ సభ్యుల ప్రచారం

బాన్సువాడ రూరల్: బాన్సువాడలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ స్పీకర్ కూతురు అరుణావెంకట్రాంరెడ్డి, చిన్న కోడలు సోనీభాస్కర్‌రెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. పలు కాలనీల్లో పర్యటించి బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ప్రజలబాగు కోసం పరితపించే స్పీకర్‌ను భారీ మెజార్టీలతో గెలిపించాలని కోరారు. వారివెంట కౌన్సిలర్ లింగమేశ్వర్, కనుకుట్ల రాజు ఉన్నారు.

గంజాయి మొక్కల స్వాధీనం



గాంధారి: మండలంలోని తిమ్మాపూర్ శివారులో ఉన్న అటవీ భూమిలో గుర్తు తెలియని వ్యక్తులు గంజాయి సాగు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం తెలిపారు. 75 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

యువకుడి అదృశ్యం

బాల్కొండ: బోదేపల్లి గ్రామానికి చెందిన కోట శ్రీనివాస్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఏఎస్సై శంకర్ ఆదివారం తెలిపారు. శ్రీనివాస్ మెడికల్ చెకప్ కోసం శనివారం బైక్‌పై నిజామాబాద్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదన్నారు. శ్రీనివాస్ తండ్రి ముత్తెన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ కేబుల్స్ చోరీ

వర్ని: మండలంలోని జాకోరలో ఉన్న వ్యవసాయ పొలాల్లో విద్యుత్ మోటార్ల వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం చోరీకి పాల్పడ్డారు. సుమారు పది విద్యుత్ మోటార్ల నుంచి కేబుల్ వైర్లను దొంగిలించినట్లు రైతులు తెలిపారు. సుమారు రూ. లక్ష విలువ చేసే వైర్లు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు.

రూ.3.26 లక్షల విలువైన మద్యం సీజ్



కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.3.26 లక్షల విలువైన మద్యం బాటిళ్లను పోలీసులు సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచారని విశ్వసనీయ సమాచారం రావడంతో దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బంది దాడులు చేపట్టారు. బాణాల చిన్న పెద్దులు అనే వ్యక్తి ఇంటిలో తనిఖీ చేయగా రాయల్ స్టాగ్ బ్రాండ్‌కు చెందిన 1,656 క్వార్టర్ బాటిళ్లు లభించాయి. వాటి విలువ రూ. 3,26,370 వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. లభించిన మద్యం కామారెడ్డిలోని లక్ష్మి నరసింహ వైన్ షాపు నుంచి కొనుగోలు చేసినట్లుగా విచారణలో తేలింది. ఎన్నికల వేళ మద్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తితో పాటు మద్యాన్ని విక్రయించిన యజమానిపై కేసులు నమోదు చేశామని ఎస్పీ సింధు శర్మ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మద్యం నిల్వ చేస్తే సీజ్ చేయడమే కాకుండా వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మాచారెడ్డి: రత్నగిరిపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ గేదె ఆదివారం మృతి చెందింది. గ్రామానికి చెందిన మారుపాక నర్సయ్య గేదె జీపీకి చెందిన బోరు బావి వద్ద మేత మేస్తుండగా విద్యుదాఘాతం సంభవించి అక్కడికక్కడే మృతి చెందినట్లు సర్పంచ్ శ్రీశైలం తెలిపారు. గేదె విలువ సుమారు రూ. 40వేలు ఉంటుందని అన్నారు.

ఘర్షణకు దారి తీసిన 'కామెంట్లు'

బీబీపేట: సోషల్ మీడియాలో ఒక పార్టీపై మరొకరు చేసిన కామెంట్లు ఇద్దరి మధ్య ఘర్షణకు దారి తీశాయి. ఈ ఘటన మండలంలోని జనగామలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల రాములు, ఆకుల ప్రవీణ్ అన్నదములు. వీరికి అదే గ్రామానికి చెందిన శివరాత్రి ప్రవీణ్‌కు సోషల్ మీడియాలో తమతమ పార్టీలపై పెట్టిన సందేశాలపై గొడవ జరిగింది. దీంతో సర్పంచ్ పాత రాజు ఇంటి వద్ద మట్లాడుదామని చెప్పి వెళ్లారు. అక్కడా మాటామాటా పెరగడంతో సర్పంచ్ రాజుకు, ఆకుల రాములు తీవ్ర పదజాలంతో దూషించుకున్నారు. అంతటితో ఆగకపోవడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఇరువర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.



జనగామలో ఘర్షణ పడుతున్న ఇరువురు

అమృతాపూర్‌లో ఇరువర్గాల ఘర్షణ

- బీజేపీ కార్యకర్తలు దాడి చేశారని బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు

డిచ్‌పల్లి: మండలంలోని అమృతాపూర్‌లో బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అమృతాపూర్ గ్రామానికి చేరుకున్నారు. ఇంతలోనే గ్రామానికి చెందిన కొందరు బీజేపీ కార్యకర్తలు తమ గ్రామానికి ఎందుకు వచ్చారని ప్రశ్నిస్తూ ప్రచారాన్ని అడ్డుకునేందుకు యత్నించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలకు బీఆర్‌ఎస్ కార్యకర్తలకు మధ్య ఘర్షణ చోటు చేసుకుని ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. సమాచారం అందుకున్న డిచ్‌పల్లి సీఐ కృష్ణ, ఎస్సై మహేశ్ తమ సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. వచ్చీ రాగానే విషయం తెలుసుకోకుండా సీఐ అకారణంగా తనపై చేయి చేసుకున్నారని ఓ యువకుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో బీజేపీ కార్యకర్తలు పోలీసుల వాహనానికి అడ్డుతగిలారు. ఎందుకు చేయి చేసుకున్నారని యువకులు సీఐతో వాగ్వావాదానికి దిగారు. చివరకు పోలీసులు సముదాయించడంతో బీజేపీ కార్యకర్తలు వెనక్కు తగ్గారు. సీఐ కృష్ణపై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని బీజేపీ కార్యకర్తలు పేర్కొన్నారు. అమృతాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలు ఆరుగురుతో పాటు మరికొందరు తనపై దాడి చేసి గాయపర్చారని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల అధికారుల అనుమతి మేరకు బీఆర్‌ఎస్ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ప్రచారానికి వెళ్లిన తనపై బీజేపీ కార్యకర్తలు సురేష్, విజయ్, రమణ, బాలయ్యతో పాటు మరికొందరు దాడి చేసినట్లు తెలిపారు.



పోలీసులతో మాట్లాడుతున్న బీజేపీ కార్యకర్తలు

వివాహిత మృతదేహం లభ్యం



మోపాల్: మండలంలోని మంచిప్ప చెరువులో వివాహిత మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ ఆదివారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. మంచిప్పకు చెందిన గోత్రాల బాలలక్ష్మి (40) భర్తతో గొడవ జరగడంతో తన ఇద్దరు కుమారులు, కుమార్తెతో కలిసి గ్రామంలో నివాసముంటోంది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాలలక్ష్మి కల్లుకు బానిసైంది. దీంతో జీవితంపై విరక్తితో ఈ నెల 17న ఇంటి నుంచి వెళ్లి స్థానిక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

బీజేపీ కార్యకర్తలపై కేసు నమోదు

డిచ్‌పల్లి: మండలంలోని అమృతాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం ఎన్నికల సంఘం అనుమతితో బీఆర్‌ఎస్ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అమృతాపూర్‌లో ప్రచారం నిర్వహించేందుకు వెళ్లారు. ఇంతలో బీజేపీ కార్యకర్తలు కొందరు ప్రచారాన్ని అడ్డుకుని బీఆర్‌ఎస్ నాయకులను తోసేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు బీజేపీ కార్యకర్తలు తాళ్ల సురేశ్, రమణ, బాలయ్య, విజయ్, శ్రీధర్, అరవింద్, మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.